విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

రాష్ట్రానికి మోదీ ద్రోహాన్ని ఎలుగెత్తి చాటుదాం..

12న నల్లజెండాలతో నిరసనలు
జయప్రదానికి వామపక్షాల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని ఎలుగెత్తి చాటుతామని వామపక్షాలు పిలుపునిచ్చాయి. విశాఖపట్నంలో ఈ నెల 11, 12 తేదీలలో ప్రధాని మోదీ పర్యటిస్తున్న నేపథ్యంలో ఆ పర్యటనను వ్యతిరేకిస్తూ 12వ తేదిన గుంటూరు జిల్లాలోని నియోజకవర్గ, మండల కేంద్రాలలో నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు నిర్వహించతలపెట్టినట్లు తెలియజేశాయి. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల సమావేశం గురువారం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు లోకం భాస్కరరావు, సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి పిల్లి చెన్నకేశవరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు యు.గనిరాజు, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీధర్‌లు మాట్లాడారు. ప్రత్యేక తరగతి హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న మోదీకి రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం ప్రజాధనంతో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేయడాన్ని వారు తప్పుబట్టారు. లక్షలాదిగా జనసమీకరణ చేస్తూ బీజేపీ నేతలతో పోటీపడుతూ ప్రధానికి స్వాగత ఏర్పాట్లు చేయడంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను పరిగణలోనికి తీసుకోకుండా ప్రధానికి స్వాగత ఏర్పాట్లు చేయడమేమిటని ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డిపై కేసులు మాఫీ కోసమా... మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతుంటే ప్రేక్షక పాత్ర వహించినందుకా... ఢిల్లీని మించిన రాజధానిని నిర్మిస్తానని ఇచ్చిన హామీని విస్మరించినందుకా... విశాఖ రైల్వే జోన్ అంశంపై ఇంకా స్పష్టత ఇవ్వనందుకా... ప్రత్యేక హోదా, విభజన హామీలు, కడప స్టీల్ ప్లాంట్ వంటి అంశాలు కేవలం మాటలకే పరిమితం చేసినందుకా... అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. మోదీపై ఎందుకు అంత ప్రేమ చూపిస్తున్నారో స్పష్టం చేయాలన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, మోదీ అడుగులకు మడుగులొత్తే వారికి పుట్టగతులు ఉండవనే విషయాన్ని మునుగోడు ఉప ఎన్నిక స్పష్టం చేసిందన్నారు. మోదీ అధికారం చేపట్టిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచేసి ప్రజలను దోపిడీకి గురి చేశారని, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి మరో ద్రోహానికి పాల్పడ్డారని విమర్శించారు. దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలను గుత్తకోటీశ్వరులకు అప్పజెబుతూ దేశ సార్వభౌమాధికారానికి ముప్పు వాటిల్లే పద్ధతుల్లో మోదీ వైఖరి ఉందని మండిపడ్డారు. రాష్ట్రంలోని పోర్టులు, విద్యుత్ ప్లాంట్‌లు అదానీలకు కట్టబెడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో నరేంద్ర మోదీ కబంధహస్తాల నుంచి రాష్ట్రాన్ని, దేశాన్ని రక్షించుకునేందుకు బీజేపీ యేతర శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సందర్భంగా 12వ తేదిన తలపెట్టిన నిరసన ప్రదర్శనలో జిల్లాలోని పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మల్యాద్రి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి, అధ్యక్షుడు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బీవీ చంద్రశేఖర రావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జిమ్నాస్టిక్స్, రోలర్ స్కేటింగ్ జట్ల ఎంపిక జరిగింది. రైఫిల్ షూటింగ్, టెన్నికాయిట్ జట్ల ఎంపిక స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో నిర్వహించారు. జట్ల ఎంపిక కార్యక్రమాన్ని ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.సుధాకర్ రెడ్డి నిర్వహించగా జట్ల ఎంపికలో ఫిజికల్ డైరెక్టర్లు జి.నరసింహారావు, ఉదయభాస్కర్, వై.పెద్దబ్బాయి, పద్మాకర్, విశ్రాంత పీడీలు మెట్టు సంజీవరెడ్డి, ఆళ్ల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత స్పీచ్ థెరపీ, వినికిడి పరీక్షల వారోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు : బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 13నుంచి 20వ తేదీ వరకు ఉచిత స్పీచ్ థెరపి, వినికిడి పరీక్షల వారోత్సవం స్థానిక కొత్తపేట భగత్ సింగ్ బొమ్మ వద్ద గల సాయి స్వర్ణ కాంప్లెక్స్‌లో గల మై వాయిస్ మల్టీ రిహాబిలిటేషన్ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, స్పీచ్ థెరపిస్ట్ రెబ్బ మోహన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మాటలు ఆలస్యం, వినికిడి సమస్య, ఆటిజం, ఏడీహెచ్‌డీ, ప్రవర్తన లోపం, చదువులో లోపం గల పిల్లలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి సలహాలు ఇవ్వబడతాయని చెప్పారు. పిల్లల తల్లిదండ్రులు ఈ ఉచిత పరీక్షల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 92472 46209 సంప్రదించాలని కోరారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన

విశాలాంధ్ర-తాడికొండ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆటో డ్రైవర్లు స్థానిక అడ్డరోడ్డు సెంటర్లో గురువారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాజధాని ప్రాంత కార్యదర్శి జీవీ రాజు మాట్లాడారు. ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. పోలీసులు ఆర్టీవో అధికారుల వేధింపులను మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. గోతుల మయంగా మారిన రహదారులను పునరుద్ధరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో షేక్ నాగుల మీరా, ముప్పాళ్ళ శివశంకరరావు, జాల మరియదాసు, నూతక్కి రాంబాబు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సీఎన్‌జీ సెగ్మెంట్‌లోకి టయోటా కిర్లోస్కర్ మోటార్

విశాలాంధ్ర-గుంటూరు : తన కస్టమర్ - ఫస్ట్ ఫిలాసఫీకి అనుగుణంగా టయోటా కిర్లోస్కర్ మోటార్(టీకేఎం) సీఎన్‌జి సెగ్మెంట్లోకి తన ప్రవేశాన్ని ప్రకటించిందని టీకేఎం సేల్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ ఒక ప్రకటనలో తెలిపారు. టయోటా గ్లాంజాస్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ మోడల్ లైనప్ రెండింటిలోనూ వినియోగదారులు ఎంచుకోవడానికి మరిన్ని మోడళ్లను అందిస్తుందన్నారు. కస్టమర్లు ఎంచుకోవడానికి ఎకో ఫ్రెండ్లీ, చౌకైన ఆప్షన్లను అందిస్తుంది. తద్వారా భారతీయ వినియోగదారులు వివిధ రకాల రవాణా అవసరాలను తీరుస్తుందని చెప్పారు. కస్టమర్ కేంద్రంగా ఉండే కంపెనీ కావడం వల్ల, కస్టమర్ల ఆసక్తికి పెద్దపీట వేయడాన్ని టీకేఎం విశ్వసిస్తుందన్నారు. టయోటా వాహనాన్ని సొంతం చేసుకునే ఆనందంతో పాటు తమ వినియోగదారులు తక్కువ నిర్వహణ ఖర్చు, టయోటా వాహనాలు అందించే పూర్తి మానసిక ప్రశాంతతతో కూడా ప్రయోజనం పొందుతారని వెల్లడించారు.

టీడీపీ గెలుపే లక్ష్యం: సాయికృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు: కలసి కట్టుగా తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేద్దామని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ అన్నారు. టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులుగా నియమితులైన నల్లూరి మురళి కృష్ణని గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో శాలువాతో సత్కరిస్తూ అభినందనలు తెలియజేశారు. వారిలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి కేఎమ్‌ఈ హుస్సేన్, షహీద్ బాబు, అంజనేయులు, కడియాల ఖుష్వంత్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ వద్ద ప్రజలకు 154వ రోజు భోజనం అందజేశారు. కొమ్మి ప్రణవి చౌదరి జన్మదినం సందర్భంగా (కొమ్మి నరేంద్ర చౌదరి, శ్రీనివాస్ చౌదరి, దీపక్ చౌదరి) సహకారంతో గురువారం అన్న కాంటీన్‌లో భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ దిండ్ల సత్యానందం, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సింహాద్రి రామారావు, దాసరి సునీల్, కాంద్రు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బందారపు నవమ్మకు సీపీఐ నివాళి

విశాలాంధ్ర-గుంటూరు : ఏఐఎస్ఎఫ్ గుంటూరు నగర కార్యదర్శి బందారపు యశ్వంత్ నాన్నమ్మ బందారపు నవమ్మ(75) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు స్థానిక రాజీవ్‌గాంధీ నగర్‌లోని ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే వలి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు స్పోర్ట్స్ యూనిఫాం, షూ పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగుతున్న 6వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవములు-2022లో పాల్గొనేందుకు వెళ్తుతున్న జిల్లా రెవెన్యూ ఉద్యోగుల బస్సును గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీల సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ జీసీ కిషోర్ కుమార్, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. క్రీడలలో పాల్గొంటున్న ఉద్యోగులకు స్పోర్ట్స్ యూనిఫాం, షూలతో కూడిన కిట్‌లను కలెక్టర్, సంయుక్త కలెక్టర్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర రావు, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ముగిసే వరకు విధుల్లోనే సిబ్బంది

విశాలాంధ్ర-గుంటూరు : నగరంలో ఈ నెల 11న జరిగే ముఖ్యమంత్రి పర్యటనలో నగర పాలక సంస్థ నుంచి చేపట్టాల్సిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేశామని, పర్యటన పూర్తి అయ్యేవరకు సిబ్బంది, అధికారులు వారికి కేటాయించిన విధుల్లోనే ఉండాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. గురువారం కమిషనర్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్, నగరంపాలెం జంక్షన్, మెడికల్ కాలేజి రోడ్, మూడు బొమ్మల సెంటర్‌లో జంక్షన్ అభివృద్ధి పనులు, పెరేడ్ గ్రౌండ్ నుంచి రమేష్ హాస్పిటల్ వరకు జరుగుతున్న డివైడర్ పెయింటింగ్, శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్టేజి, సీటింగ్, లైటింగ్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్యాంగ్ వర్క్ ద్వారా రోడ్ల స్వీపింగ్, బ్రషింగ్, క్లీనింగ్, హై బర్మ్ తొలగింపు పనులు వేగంగా జరిగేలా ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు. స్టేజి మీద, గ్రీన్ రూమ్‌లో ఎయిర్ కండిషనర్లు, జనరేటర్లు ఏర్పాటు, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్ఈ భాస్కర్, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఈఈ సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, సిటి ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి జగన్ కృషి: డిప్యూటీసీఎం

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్రంలోని మైనార్టీలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాషా తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద మైనారటీల సంక్షేమ దినోత్సవంలో ముఖ్యమంత్రి జగన్ పాల్గొననున్నందున అక్కడి పర్యటన ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. సభా వేదిక వద్ద, విజ్ఞాన మందిరం ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి పరిశీలించి అధికారులకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ స్వాంతంత్ర్య సమరయోధులు, భారతదేశ మొట్టమొదటి విద్యా శాఖా మంత్రి జనాబ్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 135వ జయంతి సందర్భంగా శుక్రవారం గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి మైనారిటీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవంలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మైనారిటీల సంక్షేమం కోసం పెద్దపీట వేశారని, నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని సంక్షేమ కార్యక్రమాలను, రాజకీయంగా ఎదుగుదలకు మైనారిటీలకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. మైనారిటీ వర్గానికి చెందిన తనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతో పాటు రాష్ట్ర స్థాయిలో సలహాదారులుగా, చైర్మన్లుగా, డైరెక్టర్లుగా నియమించారన్నారు. మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఉర్దూ భాష పరిరక్షణకు సేవలు అందించిన ప్రతిభావంతులకు అవార్డులను ప్రదానం చేయనున్నారని చెప్పారు. శుక్రవారం జరిగే మైనారిటీల సంక్షేమ దినోత్సవంలో మైనారిటీ వర్గాల ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫిజ్, రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ డైరెక్టర్ కిషోర్ కుమార్, కమిషనరు కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, శాసనసభ్యులు ముస్తఫా, మద్దాళి గిరిధర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, నగర డిప్యూటీ మేయర్ సజీలా, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధి కారి ఘని మహమ్మద్, రెవిన్యూ డివిజన్ అధికారి ప్రభాకర రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ పాల్గొన్నారు.

'ముస్లిండే' ఎందుకు నిర్వహిస్తున్నారో సీఎం చెప్పాలి: రిజ్వానా

విశాలాంధ్ర-గుంటూరు: భారత రత్న, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ముస్లిం డే'గా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎందుకు నిర్వహిస్తున్నారో సమాధానం చెప్పాలని, లేని పక్షంలో సీఎంని అడ్డుకుంటామని గుంటూరు పార్లమెంట్ టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ రిజ్వానా అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ అబుల్ కలాం అజాద్ జన్మదినం సందర్భంగా ఆయనకు ఘన నివాళి సమర్పిస్తూ.. ముఖ్యమంత్రికి 5 ప్రశ్నలు సంధించారు. నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబాన్ని ఈ ప్రభుత్వం ఆత్మ హత్య చేసుకునేలా ప్రేరేపించి నందుకు, దోషులను ఇప్పటి వరకు శిక్షించనందుకు 'ముస్లిం డే' నిర్వహిస్తున్నారా.., రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న ముస్లిం మైనారిటీలకు కేటాయించాల్సిన సబ్సిడీ రుణాలు కేటాయించకుండా ఆ నిధులను దారి మళ్లించినందుకు నిర్వహిస్తున్నారా.. రాష్ట్రంలో 82 లక్షల మంది మైనారిటీ జనాభాలో ఎందరో తమ కుటుంబ పెద్ద దిక్కును కరోనా మహమ్మారి కాటుకు కోల్పోయికరా వారి కుటుంబాలకు ఎటువంటి ఆర్థిక సాయం అందించకుండా రోడ్డున పడేసి నందుకు నిర్వహిస్తున్నారా.. రాష్ట్రంలో మదర్సాలలో చదువుకుంటున్న పేద మైనారిటీ పిల్లలకు అమ్మఒడి ఇస్తానని మాట తప్పినందుకు నిర్వహిస్తున్నారా.. రాష్ట్రంలోని ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ భూములను ఇష్టారాజ్యంగా మీ ప్రజా ప్రతినిధులు దోచుకుంటున్నందుకు నిర్వహిస్తున్నారా.. సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ 5 అంశాలకు వైసీపీ లోని ముస్లిం ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పలేని పక్షంలో వారు ముస్లిం సమాజ ద్రోహులుగా మిగిలపోతారన్నారు.

భూ క్రయవిక్రయాల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల: భూ క్రయవిక్రయాలు జరిగేటప్పుడు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్ అన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ ఆస్తులు పంపిణీ జరిపేటప్పుడు దస్తావేజులు సక్రమంగా వ్రాయించుకోగలిగితే కోర్టు కేసులకు ఆస్కారం ఉండదన్నారు. ప్రామిసరీ నోట్లు వ్రాత కాలమందు రుణ గ్రహీతలు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. న్యాయ సేవల చట్టం, కౌలు దారుల చట్టం, స్టాంప్, రిజిస్ట్రేషన్ల చట్టాలపై అవగాహన కల్పించారు. అర్హులైన వారికి మండల న్యాయ సేవాధికార సంస్థలో ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందన్నారు. ఏళ్లు తరబడి కోర్టుల్లో కేసులు జరిగితే వాది ప్రతివాదుల్లో ఒక్కరే విజయం సాధిస్తారని, అదే లోక్ అదాలత్‌లో పరస్పరం అవగాహనతో చర్చించుకుని రాజీపడితే ఇరువురూ విజయం సాధిస్తారని దానితో పాటు సమయం, ధనం కూడా ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మండలపు వేణు గోపాల్ రావు, హరిదాసు గౌరీ శంకర్, న్యాయవాది ఎన్‌వీ మహేశ్వర రావు, దుగ్గిరాల ఎస్ఐ శ్రీనివాస రెడ్డి, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొనగా, కార్యక్రమాన్ని యర్రంశెట్టి అనిల్ కుమార్ పర్యవేక్షించారు.

జీఓ 21 వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర-పెదకాకాని : ఆటో మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు పెదకాకాని సెంటర్‌లో, ఆటోనగర్‌లో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. షేక్ మస్తాన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుంటూరు జిల్లా ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీఓ 21 రద్దుతో పాటు, పెండింగ్‌లో ఉన్న పోలీస్ ఈ-చలానాలు రద్దు చేయాలని, గోతులమయమైన రోడ్లను రాష్ట్ర ప్రభుత్వం పక్కగా వేసి, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నియంత్రించి, గ్రీన్ టాక్స్ రోడ్ టాక్స్ టోల్ ప్లాజా ఫీజులు రద్దు చేసి, సీఎన్‌జీ గ్యాస్ ధరలు నియంత్రించి, బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలను ఇప్పించాలన్నారు. ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి పీఎఫ్, ఈఎస్ఐలతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపి, సుబ్బారావు, మస్తాన్, ఇల్లా సంటి, సురేష్, గోపి, మరియదాసు, కోటి, ప్రభుదాసు, బాబురావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పొన్నూరు: ఆటోలు, మోటారు వాహనాలపై భారీగా జరిమానాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 21 ను రద్దు చేయాలని ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. స్థానిక ఐలాండ్ సెంటర్లో గురువారం ధర్నా చేపట్టారు. ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మిక్కిలి బాబురావు అధ్యక్షత వహించిన ధర్నాలో ఆరేటి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆటో మోటార్స్ వాహనాలపై పెండింగ్ లో ఉన్న పోలీసు చలాన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ పొన్నూరు పట్టణ కార్యదర్శి జంపని గోవిందరాజు మాట్లాడుతూ ఆటో మోటారు వాహనాలపై పెంచిన గ్రీన్ టాక్స్ మరియు రోడ్ టాక్స్‌లను తగ్గించాలన్నారు. ఆటో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ జి వెంకయ్య మాట్లాడుతూ ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి ఆటో కార్మికులకు బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కలిగించాలన్నారు. ఆటో యూనియన్ నాయకులు ఎన్ నందకుమార్, నరేంద్ర, ట్రాలీ ఆటో యూనియన్ నాయకులు ఈ.రామారావు, ధనుంజయ్, సుబ్బయ్య , వీర రాఘవులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

రాయల్ కేఫ్‌ను ఆదరించండి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక అరండల్ పేట 5/3లో పార్కు (పక్కన) ఏర్పాటు చేసిన రాయల్ కేఫ్ టీ స్టాల్‌ను సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బయ్య ఆధ్వర్యంలో అరండల్‌పేట ప్రాంతంలో మంచి టీ స్టాల్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన పదార్థాలు అందజేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దేవానంద్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి తగ్గట్టు నాణ్యమైన పదార్థాలు అందించే సంస్థలు, యాజమాన్యం లేదని, మెరుగైన సేవతో పాటు నాణ్యమైన, శుభ్రమైన పదార్థాలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దూపాటి వెంకట రత్నం, వెంకట రమణ, అంజిబాబు, నాగరాజు వెంకటరమణ, జనార్ధన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ

విశాలాంధ్ర-పొన్నూరు: ప్రభుత్వ బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులకు రోటరీ క్లబ్ పొన్నూరు వారి ఆధ్వర్యంలో దుప్పట్లు, రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. చలి తీవ్రత పెరగడంతో హాస్టల్లోని విద్యార్థులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం అందించకపోవడంతో వారు చలి తీవ్రతకు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన పొన్నూరు రోటరీ క్లబ్ వెంటనే స్పందించి ప్రభుత్వ బీసీ హాస్టల్లో ఉన్న 16 మంది విద్యార్థులకు రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. సందర్భంగా రోటరీ క్లబ్ పొన్నూరు అధ్యక్షులు బోడపాటి రామారావు మాట్లాడుతూ విద్య వైద్య రంగాలలో రోటరీ విస్తృతమైన సేవలు అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు ఎస్.బాలకృష్ణ, కుదుస్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఎండోస్కోపి ద్వారా గడ్డ తొలగింపు

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి(జీజీహెచ్)లో తొలి సారిగా ఎండోస్కోపీ ద్వారా కిడ్నీలో గడ్డను గుర్తించి ముక్కను గ్యాస్ట్రో ఏంట రాలజీ వైద్యులు తీశారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం లచ్చుగుడిపూడి గ్రామానికి చెందిన 45 సంవత్సరాల ఆదినారాయణ కడుపు నొప్పితో 4 రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. దీంతో ఎండో సర్జరీ విభాగం వారు వైద్య పరీక్షలు చేసి కిడ్నీలో గడ్డ ఉందని... అది క్యాన్సర్ గడ్డలా తయారయ్యే అవకాశం ఉందన్న అనుమానంతో ముక్క పరీక్షా కోసం గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి వైద్యులు పంపించారు. పేషంట్‌కు ఎండోస్కోపీ అల్ట్రాసౌండ్ ద్వారా ముక్క తీయాలని ఆచార్యులు జగన్ మోహన్, సహాయ ఆచార్యులు నాగూర్ బాషాతో పాటు డాక్టర్ శివ రామకృష్ణ నిర్ధారణకు వచ్చారు. ఎండోస్కోపి ద్వారా పది నిమిషాల్లో ముక్కను తీయడం విశేషం. పేషంట్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి అభినందించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, శాసనమండలి సభ్యులు తలశిల రఘురాం, లేళ్ళ అప్పిరెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, నగర పాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర నాయుడు, శాసనసభ్యులు ముస్తఫా, మద్దాళి గిరిధర్‌తో కలసి పరిశీలించారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ వేదిక వద్ద, మెడికల్ కళాశాలలో పైలాన్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, శాసనమండలి సభ్యులు తలశిల రఘురాం పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీలా, మైనార్టీ సంక్షేమ శాఖ డీడీ ఖదర్ వలీ, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కరుణారస హాస్య చక్రవర్తి ఏవీఎస్

విశాలాంధ్ర-తెనాలి : అచ్చ తెలుగుదనంతో హాస్యంతో వ్యంగ్యాస్త్రాలతో అందరి హృదయాల్లో విశిష్ట స్థానం సముపాదించిన మహోన్నత వ్యక్తి ఆమంచి వెంకట సుబ్రహ్మణ్యం చిరస్మరణీయులని వక్తలు నివాళులర్పించారు. తెనాలి గాంధీనగర్ బొల్లిముంత ఫౌండేషన్ హాలులో తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఏవిఎస్ తొమ్మిదవ వర్ధంతి సభ జరిగింది. నటుడు దర్శకుడు వంగా లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ నిర్మాతగా, జర్నలిస్టుగా, సాంస్కృతిక సంస్థల వ్యవస్థాపకునిగా విశేష కృషి చేశారన్నారు. జర్నలిస్టుగా ఆంధ్రజ్యోతిలో వ్యాసాలు, వార్తలు రాసి పాఠకుల హృదయాలలో చెరగని ముద్ర వేశారన్నారు. చిన్నతనంలోనే వ్రాత పత్రికను ఏర్పరచి వార్తలు, హాస్యగుళికలు, వ్యాసాలు రాశారన్నారు. తెనాలిలో రసమయి నాటక సంస్థ స్థాపించి తద్వారా అనేక ప్రదర్శనలిచ్చారన్నారు. మిమిక్రీ ఆర్టిస్టుగా రాష్ట్ర రాష్ట్రేతరంగా ప్రదర్శనలు ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో పేద సాదలకు సహాయంగా మెడికల్ క్యాంపులు నిర్వహించారన్నారు. సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ తనతో గల బాంధవ్యాలను వివరించారు. తెనాలి ఫిలిం సొసైటీ కార్యకలాపాల్లోని జీవితాంతం సహాయ సహకారాలందించారని చెప్పారు. సినీ రంగరంలో మా జనరల్ సెక్రటరీగా పని చేశారని, తెలుగు చిత్ర పరిశ్రమ సువర్ణ అధ్యాయంలో వెలుగుతున్న హాస్యనటుల్లో మేటి అన్నారు. మాది తెనాలి, మీది తెనాలి అని మాతృగడ్డపై పేరుతో పాపులర్ చేశారన్నారు. నాటికి నేటికి సినీ ప్రపంచం ఉన్నంతకాలం సినీ ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని జోహార్లర్పించారు. నీటీ నటులు, అభిమానులు, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బెల్లంకొండ వెంకట్, ఏఐటీయూసీ అధ్యక్షులు గురుబ్రహ్మం, ఇస్మాఫ్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీకాంత్, నటీమణులు విజయలక్ష్మీ, విజయదుర్గ, జ్యోతి, శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు పోయినవి

కుంభ నాగేశ్వరరావు తండ్రి వెంకటేశ్వర్లు అను నేను నాయొక్క 8వ తరగతి మార్క్ లిస్ట్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ ఫొటోస్టాట్ కొరకు ధూళిపాళ్ల సెంటర్ కు తీసుకొని వెళ్లుచుండగా దారిలో ఎక్కడో జారిపడి పోయినవి. దొరికినవారు **కుంభ నాగేశ్వరరావు** యాదవ బజారు ధూళిపాళ్ల సత్తెనపల్లి మండలం అనే చిరునామాకు అందచేయగలరు .

GENERAL NOTICE
IN THE COURT OF THE HON'BLE I ADDL. SENIOR CIVIL JUDGE::GUNTUR
I.P. No. 84 / 2022

Between:-
Pavuluri Suresh Babu,S/o.Koteswara Rao, 2) Pavuluri Aruna, W/o.Suresh Babu, Both are R/o.Flat No:502,Kartikeya Residency, Pragathi Nagar, Turakapalem Road, Guntur. .....Petitioners
and
1)Nallapaneni Rama Krishna,S/o.Venkateswarlu,Flat No:G-3,1st Floor, SudhaTowers, Lakshmi Puram Main Road,Guntur.,2)Ponnaganti Venkateswara Rao, S/o. Chinna Sambaiah, R/o.Flat No:301,Kartikeya Residency,TurakapalemRoad,Pragathi Nagar, Guntur.,3)Kotha Murali Das,S/o.Venkaiah, R/o. Audipudi(Vil),Karamchedu(Md),Bapatla Dist.,4)Bade Naveen Kumar, S/o.Musalidas, R/o.Audipudi(Vil), Karamchedu(Md),Bapatla Dist.,5)Gottam Padma, W/o.SrinivasaRao,R/o.7/3 Chandramouli Nagar, Guntur., 6)Shaik Shamsher Babu, S/o.Meera, R/o. Opp.Guntur Bus Stand, Security Office, Plot No.72, Guntur., 7)ThotaVijaya Kumar, S/o.Not Known, R/o. Flat No.208,Sree Maha Lakshmi Towers, N.T.R. Stadium Back Side, Krishna Nagar, Guntur. .....Respondents

పైనెంబరు ఐ.పి.లోని పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమనికోరుతూ ఈనెంబరు ఐ.పి.నిదాఖలు చేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైనా అభ్యంతరములు వుంటే తెలుపుకొనవలసినదిగా శ్రీకోర్టువారు జనరల్‌నోటీసు నిమిత్తం ది.21-11-2022కి వాయిదావేసినారు. కావున ఆరోజు ఉ.గం.10.30 ని.లకు పైకోర్టువారి ఎదుట అక్షేపణలు వున్నవారు స్వయంగా గాని, ప్లీడరుగారి ద్వారా గాని హాజరై తమకుగల అక్షేపణలను తెలుపు కొనవలెను లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 21-11 -2022.

KOTAMRAJU VENKATESH SARMA
Advocate for Petitioners, Vijayawada.Cell: 9030945678

Court Notice
IN THE COURT OF THE HON'BLE I ADDL.SENIOR CIVIL JUDGE::GUNTUR
I.A.No:304/2021 in O.S.No:139/2017

Between:
Maddala Nagasri - Petitioner/Plaintiff
AND
Vemuri Sampurna & Others - Respondents/Defendants

To,
R-9/D-9: Sheik Basheed, S/o.Allah Bakshi, Door No:6-8, Chebrolu (Vil & Md), Guntur Dist.
R-10/D-10: Sheik Subhani,S/o.Salar, Door No:6-8, Chebrolu (Vil & Md), Guntur Dist.

పై నెంబరు దావాలోని **I.A.304/2021** ను 9 &10వ రెస్పాండెంట్లుగా/ ప్రతివాదులుగా మిమ్మలను చేర్చమని కోరుతూ దాఖలు చేసిన పిటీషనులో 9&10 రెస్పాండెంట్లు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు/సమన్లు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా,సదరు ఆర్డరు ప్రకారము మీరు **ది:23-11-2022న ఉ.గం.10-30 ని.లకు** పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.
వాయిదా తేది:23-11-2022
(శ్రీ కోర్టు వారి అనుమతితో)

అళ్ళ గోవిందరావు, పిటిషనరు/వాది తరపు అడ్వకేట్, నగరంపాలెం, గుంటూరు.,
సెల్: 9849414044

అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-నూజెండ్ల : పారదర్శకంగా అవినీతికి తావులేకుండా, కులం, మతం, వర్గం, పార్టీలకతీతంగా, పారదర్శకంగా అర్హులైన అందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంకల్పమని వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని అప్పాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి గడప వద్దే సంక్షేమ పథకాలు వైసీపీ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీ నుంచి అడ్డంకులు ఎదురవుతున్నా ఎక్కడా వెనక్కి తగ్గకుండా ముందుకు సాగుతోందన్నారు. అందరికీ మంచి జరగాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన ఉంన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.రోజా రాణి, ఎంపీటీసీ గాదె సుభాషిని, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మండల కార్యదర్శి నక్కా నాగిరెడ్డి, నూజెండ్ల సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, వైసీపీ నాయకులు గంధం బాలరెడ్డి, జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జాగర్లమూడి సుబ్బారావు, ఆంజనేయులు, కొమ్మిరిశెట్టి రామారావు, సర్పంచులు కంచర్ల బాబు, పరిమి శేషు, తహశీల్దార్ మధుబాబు, ఎంపీడీఓ షేక్ జిలానిభాష తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సాధనలో గ్రంథాలయాల పాత్ర కీలకం

విశాలాంధ్ర-ఈపూరు : స్వాతంత్ర్య సాధనలో గ్రంథాలయాల పాత్ర మరవ లేనిదని ముప్పాళ్ళ గ్రంథాలయాధికారిణి ఎస్.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గోడప్రతులను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని, పుస్తక పఠనాన్ని అందరూ అలవాటు చేసుకోవాలని సూచిం చారు. గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా సమాజానికి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖనం తదితర అంశాలలో పోటీలు నిర్వ హిస్తారని తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే వారోత్సవాలను విద్యార్థులు, పాఠకులు జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఊట్ల రామారావు, సూరే బ్రహ్మయ్య, సూరే అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు

విశాలాంధ్ర-గురజాల: హత్యాయత్నం కేసులో ఇరువురికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు జరిమానా విధించారని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బండి వీరభద్రుడు తెలి పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దుర్గి మండలం అడిగొప్పల గ్రామానికి చెందిన మేకల చిన అమ్మోరయ్యను అతనిభార్య మేకల సుధారాణి, ప్రియుడు వీరా నీలాంజీలు వారి అక్రమ సంబంధంనకు భర్త అడ్డువస్తున్నాడనే కారణంతో పథకం ప్రకారం హత్య చేసేందుకు పన్నాగం పన్నారు. 2017 జనవరి 2వ తేదీన తెల్లవారుజామున మేకల చిన అమ్మోరయ్య నిద్రిస్తుండగా హత్యాయత్నంకు పాల్పడ్డారు. చిన అమ్మోరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుర్గి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో ఇరువురిపై నేరం రుజువు కావడంతో వారికి సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషాద్రి జైల్ శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

గ్రంథాలయ వారోత్సవాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-అమరావతి : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అమరావతి గ్రంథాల యంలో జరుగుతున్నట్లు అమరావతి గ్రంథాలయ ఇన్‌చార్జ్ ఎం.వెంకా యమ్మ తెలిపారు. గురువారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞానాన్ని వినోదాన్ని వికాసాన్ని అందించే గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేసేందుకు గురువారం మండల కేంద్రమైన అమరావతితో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పాఠశాల వద్దకు వెళ్లి కరపత్రాలను వాల్‌పోస్టులను పంపిణీ కార్యక్రమాన్ని చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రంథాలయ జాతీయ 55 వారోత్సవాల గోడపతులను ఆవిష్కరించారు. ఈ వారోత్సవాల సందర్భంగా వివిధ పాఠశాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని సైన్స్ పరిజ్ఞానంతో ఆటలు పాటలతో ఉత్తీర్ణులతో 20వ తేదీ గెలుపొందిన విద్యార్థులకు పెద్దఎత్తున బహుమతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారం రోజులపాటు జరిగే వారోత్సవాల్లో పాటలు, డ్రాయింగ్, సైన్సు తదితర ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గురువారం స్థానిక శివయ్య స్తూపం సెంటర్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ ఏరియా ప్రధాన కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటోలు మోటార్ వాహనాలపై భారీగా జరిమానాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 21 నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో మోటార్ వాహనాలపై పెండింగ్లో ఉన్న పోలీస్ ఈ చలానాలను రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న గోతులమయమైన రోడ్లను పక్కగా వేసి ప్రజల ప్రాణాలను రక్షణ కల్పించాలని, డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, విద్యుత్ ఇంటి పన్ను, చెత్త పనులను రద్దుచేసి ఆటో కార్మికులకు కుటుంబ సభ్యులకు జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో మోటార్ వాహనాలపై పెంచిన గ్రీన్ టాక్స్ రోడ్డు టాక్స్ టోల్ ప్లాజా ఫీజులను రద్దు చేయాలని, సిఎన్జి గ్యాస్ ధరలను నియంత్రించాలని, ఫైనాన్స్ సిండికేట్ వ్యవస్థ కార్మికుల వద్ద నుండి వడ్డీలకు చక్ర వడ్డీలు వసూలు చేస్తున్న తీరుని అరికట్టాలని తదితర సమస్యలు పరిష్కరించాలి డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొండ్రముట్ల సుభాని, ఏ పవన్ కుమార్, ఆర్ వందనం , ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బి ఫ్రాన్సిస్, వెంకటేశ్వర్లు, ఏ రామారావు, జి రవీంద్రబాబు, పి రవికుమార్, ఎం మోజేష్ , వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై మొండి వైఖరి వీడాలి

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలు, ఉద్యోగుల పట్ల అను చిత ధోరణి, అక్రమ పనిష్మెంట్లు, నిరంకుశ వైఖరికి నిరసనగా ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రెండవ రోజు గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎం.పాపయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ డిపో మేనేజర్ సత్వరమే స్పందించి చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించి కార్మికులలో నెలకొన్న అసంతృప్తి తొలగించాలని కోరారు. డిపో అధ్యక్షులు ఇంచార్జ్ సెక్రటరీ డిజీ విన్సెంట్ మాట్లాడుతూ అక్రమ పనిష్మెంట్లు రద్దు చేయాలని, డిపో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు గుమ్మడి వెంకటే శ్వరరావు మాట్లాడుతూ డిపో మేనేజర్ యూనియన్ పక్షపాత వైఖరికి, మొండి వైఖరికి నిరసన తెలుపుతూ వెంటనే డిపో సమస్యల పట్ల చర్చలు జరిపి పరిష్కారం చూపాలని లేనిచో భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలకు డిపో మేనేజర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు డిపో జిల్లా, రాష్ట్ర కమిటీ నాయకులు మరియు బాబురావు శివ నాయక్, లక్ష్మణ బాబు, రాంబాబు, శివనాగేశ్వరరావు, ఈపూరు వెంకటేశ్వర్లు, ఎస్ఎం రాజా, చంద్రబాబు వైపి రాజా, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలదారులకు అన్నదానం

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ లోని పాత శివాలయంలో అయ్యప్ప మాలదా రులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి 26వ వార్డు మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి, స్వాములకు అన్నప్రసాదాలను స్వయంగా వడ్డించారు. సృష్టిలో అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని వాసిరెడ్డి తెలిపారు. ఏటా అన్నదానం నిర్వహిస్తున్న అన్నదానసేవా సమితి ట్రస్ట్ సభ్యులను వాసిరెడ్డి కొనియాడారు.

జీవో 21 రద్దు చేయాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: ఆటో మోటార్ వాహనా లపై భారీగా జరిమానాలు విధిం చేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని కోరు తూ మండల కేంద్రమైన అచ్చం పేటలో ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో గురువారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు పున్న కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ఏపీ వర్కర్స్ ఆటో యూనియన్ ఏఐటీ యూసీ పిలుపుమేరకు నిరసన వ్యక్తం చేశారని అన్నారు. ముఖ్యంగా ఆటో మోటార్ వాహనాలపై పెండింగ్లో ఉన్న ఈ చలాన్‌లు రద్దు చేయాలన్నారు. డీజిల్, పెట్రోలు, వంటగ్యాస్, విద్యుత్తు, ఇంటి పన్ను, చెత్త పన్నులను రద్దుచేసి కార్మికులకు జీవన ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆట వర్కర్ సీనియర్ నాయకులు ప్రసాదు, బాజీ, వెంకట్రావు, స్వామి, నాగరాజు, మండల సీపీఐ కార్యదర్శి యోధుల మధుబాబు, పట్టణ కార్యదర్శి సంపంగుల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-మాచర్ల: ఆటో, మోటార్ వాహనాలపై భారీగా జరిమానాలు పెంచుతూ విడు దల చేసిన జీవో నెంబర్ 21ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయా లని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపరీతంగా పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాయితీలు కల్పించి ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకో వాల్సిన ప్రభుత్వాలు కొత్త జీవోలను జారీ చేసి వారిపై మరింత పన్నుల భారాన్ని పెంచటం దుర్మార్గమ న్నారు. పెంచిన రోడ్డు టాక్స్, టోల్ ప్లాజా ఫీజులు, గ్రీన్ టాక్స్‌లను వెంటనే రద్దుచేసి వాహనదారులను ఆదుకోవాలని అన్నారు. బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలను ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాల యంలో వినతిపత్రం అందజేశారు. సీపీఐ టౌన్ సహాయ కార్యదర్శి మంజుల లక్ష్మయ్య, ఏఐవైఎఫ్ నియోజకవర్గం కార్యదర్శి నక్రా రంగస్వామి, కొండపర్తి బ్రహ్మాచారి, షేక్ నజీర్, ఆటో యూనియన్ నాయకులు షేక్ అబ్దుల్లా, బాలయ్య, వెంకటేష్, వెంకటయ్య, బ్రహ్మయ్య, ఏబు, బుడ్డయ్య, కోటయ్య పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పెదకూర పాడు రూరల్: జీవో నెంబర్ 21ని వెంటనే రద్దు చేయాలని పెదకూరపాడు నియోజవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోడు శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ఏఐటియుసి పిలుపులో భాగంగా మండల కేంద్రమైన 75 తాళ్లూరు ఏపీ ఆటో వర్కర్స్ అందు మోటర్ మెకానిక్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులు న్యాయం చేసే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. ఆటో కార్మికులపై కేసులు బనాయిస్తూ అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్ సీనియర్ నాయకులు షేక్ సుభాని, కార్యదర్శి బెజ్జ వసంతరావ, గురువులు, దేవ సహాయం, తాళ్లూరి ఏసబ్బు, పుల్లయ్య, ప్రకాష్, జంగాల వెంకట్రావు, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-చిలకలూ రిపేట : ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిం చాలని చిలకలూరిపేట ఏరియా ఏఐటీయూసీ అధ్య క్షులు కామ్రేడ్ పేలూరి రామారావు కోరారు. గురువారం ఏఐటీయూసీ అను బంధ ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో చిలకలూరిపేట పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని అల్లూరి సీతారా మరాజు విగ్రహం వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన కార్యక్రమం చేప ట్టారు. కార్యక్రమానికి సీపీఐ ఏరియా ఇన్‌చార్జ్ కార్యదర్శి కామ్రేడ్ నాగభైరు రామసుబ్బాయమ్మ పాల్గొని మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని, కార్మికులపై పోలీసులు, ఆర్టీఏ అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఏఐటీయూసీ జాయింట్ సెక్రటరీ దాసరి శ్యాం బాబు, పట్టణ టాటా ఏసీ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నల్లపాటి వెంకటేశ్వర్లు, మెడికల్, పట్టణ ఎన్ఆర్‌టీ సెంటర్, స్మామాట్ పాయింట్ అధ్యక్షులు కుంచాల సాంబయ్య, టాటా ఏసీ యూనియన్ నాయకులు శ్రీను, బి.నాగేశ్వరరావు, దాసరి లింగారావు, ఆరా ధ్యుల రామకృష్ణ, బొంతా భగత్ సింగ్, తోట నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరణ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సత్తెనపల్లి పట్టణం అమరావతి స్కూల్లో జన విజ్ఞాన వేదిక గుంటూరు జిల్లా 17వ మహాసభల కరపత్రాలను జన విజ్ఞాన వేదిక సత్తెనపల్లి పట్టణ అధ్య క్షులు, న్యాయవాది ఏడుకొండలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బత్తుల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 13న సత్తెనపల్లి అమ రావతి స్కూల్‌లో 17వ మహాసభలు జరుగుతాయన్నారు. మెరుగైన సమాజ స్థాపనకు తమ వంతు సహాయ సహకారాలు అందించదలచుకున్నవారు జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరవచ్చన్నారు. జన విజ్ఞాన వేదిక మూఢ నమ్మకాలకు మూఢ ఆచారాలకు వ్యతిరేకంగా పోరాడుతుంది తప్ప ఏ మతానికి వ్యతిరేకం కాదన్నారు. జన విజ్ఞాన వేదిక ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, జేవీవీ ఆశయాలు లక్ష్యాలు, ఆలోచనలలో పాలు పంచుకుందామనే ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉడుముల విద్యాసాగర్ రెడ్డి, పల్నాడు జిల్లా కన్వీనర్ కంబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలను దోచేస్తున్న జగన్ ప్రభుత్వం

విశాలాంధ్ర-బొల్లాపల్లి : వైసీపీ పాలనలో నిత్యవసర వస్తువులతో పాటు అన్ని రకాల ధరలు పెరిగి ప్రజలకు బతుకు భారమైందని మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనే యులు దుయ్యబట్టారు. బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండలంలోని కొప్పుకొండ తండా, గణేష్ని పాలెం గ్రామలలో జీవీ హాజరై ఇంటింటికి తిరిగి రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్, నిత్యవసర వస్తువులు, ఆర్టీసీ చార్జీలపై బాదుడే బాదుడు మారిందని, ఇసుక కొరత సృష్టించి దోచుకుంటున్నారని విమర్శించారు. రైతుల పంటకు గిట్టుబాటు ధర లేదని, అధిక వర్షాలు, వైరస్‌లతో పంట నష్టపోయి అప్పుల పాలైన రైతులు, కౌలు రైతులను ఆదుకోకపోవడంతో వారు ఆత్మహ త్యలకు పాల్పడ్డారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే జగన్ రెడ్డి ప్రభుత్వం ప్యాలెస్‌లో ఉండి చోద్యం చూస్తుందని విమర్శించారు. ఈ దోపిడీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని మునుగోడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు సాహిత్యమునకు విశేష సేవ చేసి, తొలి తెలుగు శబ్దకోశమును పరిష్కరించి ప్రచురించిన మహనీయులు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా క్షేత్రలక్ష్మి పద్య కావ్యం, పల్నాటి యుద్ధం నేపథ్యంగా పల్నాటి వీరచరితము మొదలగు వానిని రచించిన కవిబ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్య వర్ధంతిని, తెలుగు నవలా ప్రపంచంలో విజయవంతమైన, ప్రయోగాత్మక నవల అల్పజీవి రచయిత, నటుడు రావిశాస్త్రి వర్ధంతిని జరిపి వారి ఘనతను వక్తలు శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి, శ్రీనివాసరెడ్డి, రఫీ, తెలుగు ఉపాధ్యాయుడు టి.అరుణ్ కుమార్, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య, పీసీ చైర్‌పర్సన్ ఎం.మాధవి తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-శావల్యాపురం : పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయటమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయ లబ్ది కోసం ప్రతిపక్ష పార్టీ చిన్న విషయాలకు కూడా పత్రికలకు ఎక్కడం సరైన పద్ధతి కాదని హితవుపలికారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారన్నారు. ఈ విషయాన్ని గమనించిన ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేకి ఎక్కడ పేరు వస్తుందోనని ఈబీసీ నేస్తం వేల్పూరులో లబ్ధిదారులకు అందడం లేదని పత్రికలలో వేయించి తామే ఇప్పించామని అమాయక మహిళలను మోసం చేస్తున్నారని అన్నారు. పొలం అధికంగా ఉండటం, కారు, విద్యుత్ బిల్లు అధికం, ఇన్‌కమ్ టాక్స్ ఉన్నవారికి సంక్షేమ పథకాలు రావని తెలిపారు. గత ప్రభుత్వంలో వేల్పూరు సర్పంచ్‌గా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సతీమణి ఆదిలక్ష్మి ఉండగా ఒకే ఒక పేద మహిళకు పెన్షన్ ఇవ్వమని అడిగితే అప్పటి టీడీపీ నాయకులు ఇవ్వలేదనేది నిజం కాదా అన్నారు. శావల్యాపురం సొసైటి చైర్మన్ నాగులపాటి చెన్నయ్య మాట్లాడుతూ రాజకీయాలలో విలువలు లేకుండా పోయాయని, 2014 ఎన్నికలకు ముందు ఏ పథకాలు వచ్చినా ఊరంతా కలసి కూర్చుని మాట్లాడుకుని ఇచ్చే వారని, 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పరిస్థితులు లేకుండా పోయామని తెలిపారు. జన్మభూమి కమిటీలు ఎవరికి చెబితే వారికే సంక్షేమ పథకాలు ఇచ్చారని తెలిపారు. ఈపూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజకీయ లబ్దికోసం ప్రతిపక్షాలు ఈ విధంగా మాట్లాడటం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో గుంటు పాలెం గ్రామంలో 17 పెన్షన్లు నారా లోకేష్ ఇవ్వమని కోరినా ఈ జన్మభూమి కమిటీలు ఇవ్వలేదని అన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహకారంతో అన్ని గ్రామాలలో అర్హత కలిగిన వారందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాగులపాటి శ్రీనివాసరావు, ఒంగోలు ఆంజనేయులు, సూరాబత్తుని కృష్ణారావు ఉన్నారు.

రేపల్లె తొలి డీఎస్పీగా మురళీకృష్ణ

విశాలాంధ్ర-రేపల్లె : రెవెన్యు డివిజన్ తొలి డీఎస్పీగా తక్కెళ్ళపాటి మురళీకృష్ణ నియమితుల య్యారు. రేపల్లె రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడ టంతో పోలీసు సబ్‌డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లెలో ఎస్ఐగా పనిచేశానని చెప్పారు. తెనాలి స్టేషన్లో సీఐగా విధులు నిర్వహించటం వలన రేపల్లె పోలీసు సబ్‌డివిజన్‌పరిధిలోని 12 పోలీసుస్టేషన్‌లు, నాలుగు సర్కిల్ కార్యాలయాలపై పూర్తి అవగాహనా ఉందని, ట్రాఫిక్, క్రైమ్ వంటి అంశాలను నియంత్రణ సిబ్బందితో కలిసి చేయిస్తామని తెలిపారు.

విఠలేశ్వరస్వామికి లక్షబిళ్వార్చన

విశాలాంధ్ర - భట్టిప్రోలు : కార్తీక మాసం పురస్కరించుకుని శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ విఠలేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం లక్షబిళ్వార్చన, కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలో 35వ కార్తీక మాస వనసమారాధనను ఘనంగా జరిపారు. కార్తీకమాస పూజల్లో భాగంగా గురువారం రాత్రి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు. రాత్రి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించిన కార్తీక సమారాధనలో మూడు లక్షల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమాలను దేవస్థాన ఈఓ దీవి వెంకట అప్పలాచార్యులు, సమారాధన ఉత్సవ కమిటీ సభ్యులు ఆదిన వెంకట సుబ్బారావు, మేడూరి వీరయ్య, వంగర నాగేశ్వరరావులు పర్యవేక్షణ గావించారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : గ్రంథాలయ వారోత్సవాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఎంపీపీ షేక్ బాజీ అన్నారు.ఈ నెల 14 నుండి 20 వరకు పిట్టలవానిపాలెం శాఖ గ్రంథాలయం నందు జరిగే 55 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కర పత్రాలను గ్రంథాలయ అధికారి మోర్ల శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం మండల ఎంపీపీ షేక్ బాజీ, ఇన్చార్జి ఎంపీడీవో పద్మజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రంథాల యాలు విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయాలతోనే జ్ఞానం, విజ్ఞానం వస్తుందని చెప్పారు.గ్రంథాలయ అధికారి మోర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ 55వ జాతీయ గ్రంథాల వారోత్సవాలు సందర్భంగా పాఠకులు ఇంటికి తీసుకెళ్లిన పుస్తకాలు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పుస్తకాలు గ్రంథాలయంలో అప్పగిస్తే ఎలాంటి అపరాధ రుసుము లేకుండా తీసుకుంటారని చెప్పారు. నూతన సభ్యత్వం తీసుకునే వారికి విద్యార్థులకు రూ.50, పెద్దలకు రూ.100 చెల్లించి గ్రంథాలయంలో సభ్యులుగా చేరాలని, నూతన పుస్తకాలు వచ్చిన సందర్భంగా పాఠకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అయన కోరారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు: మంత్రి

విశాలాంధ్ర-వేమూరు : పార్టీలు, కులమతాలకు అతీతంగా జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున పేర్కొన్నారు. గురు వారం మండలంలోని చావలి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తు న్నారని అన్నారు. నవరత్నాల పేరిట పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవానికి సంతృప్తినిస్తున్నా యన్నారు. కాపులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసే చంద్రబాబునాయుడు నేడు కాపులపై ప్రేమ వలకబోస్తు న్నారని విమర్శించారు. వంగవీటి రంగా హత్యకు తనకు ఎటువంటి సంబంధం లేదని చంద్రబాబునాయుడు చెప్ప గలరా అని నాగార్జున ప్రశ్నించారు. తన పాలనలో కాపులను అణగదొక్కి నేడు పవన్‌కళ్యాణ్‌తో జటకట్టేం దుకే మాత్రమే కాపులపై ప్రేమ అని మంత్రి విమర్శించారు. చంద్రబాబు కుయు క్తులను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రాబోయే ఎన్నికల్లో కూడా ప్రజలు జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి పట్టం కడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ గాజుల మోహన్, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లి ముంత ఏడుకొండలు, జడ్‌పిటిసి గాజుల హేమలత, ఎంపీపీ ఎల్లమాటి మోహన్, మాజీ జడ్‌పిటిసి విష్ణుమొల కల వెంకటేశ్వర రావు, మాజీ ఎంపీపీలు విష్ణు వెంకటరెడ్డియ్య, బొలిశెట్టి ప్రభాకరరావు, దాసరి ముత్తయ్య, గాజుల చిన్నభాను, గోపాలం రాము, పిఏసిఎస్ అధ్య క్షులు గాజుల భాను ప్రకాష్, కమ్మెల తిరుపతిరాయుడు, రిటైర్డ్ ఎంఈవో మోహన్‌రావు, మాజీ ఎంపీటీసీలు గాంధీ దేవదానం, నగేష్, ఆనందరావు, వివిధశాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శి, వాలంటీర్లు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో విఠలేశ్వర నగర్ కాలనీ

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ప్రభుత్వాలు మారుతున్న తమ కష్టాలు మాత్రం తీరడంలేదు. తాము అధికారం లోకి వస్తే కాలనీని అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమ యంలో నాయకులు చేస్తున్న వాగ్దానాలు గాలిలో కలసి పోతున్నాయి. దశాబ్దాల తరబడి కాలనీ అభివృద్ధికి నోచు కోక నిత్యం అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రమైన భట్టిప్రోలులోని నివేశన స్థలాలు లేక అద్దే గృహాలలోను, రహదారి వెంబడి పూరి గుడి పాకలు నిర్మించుకుని జీవిన సాగిస్తున్న నిరు పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నిర్వహించిన అనేక పోరాటాల ఫలి తంగా 1998లో అప్పటి ప్రభుత్వం స్థానిక విఠలేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన 6.88 ఎకరాల మాగాణి భూములను 182 మంది లబ్ధిదారులకు నివేశన స్థలా లను పంపిణీ చేసింది. స్థలాలు మంజూరు చేసి రెండు న్నర దశాబ్దాలు కావస్తున్న పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగకపోవడంతో కాలనీ వాసులు నిత్యం కష్టాలు ఎదుర్కొంటునే ఉన్నారు. గత ప్రభుత్వం కాలనీలో వీధి దీపాలు, మంచినీటి వసతులను కల్పించడం జరిగింది. పూర్తి స్థాయిలో రహదారులు అభివృద్ధి చెందకపోవడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు కాలనీ జలదిగ్బంధానికి గురవుతుంది. అంతేకాక కాలనీని ఆనుకుని వెల్లటూరు ఛానల్ ఉండడంతో కాలువలో పంట నీరు ఉధృతంగా ప్రవహిస్తునప్పుడల్లా కాలనీని పంట నీరుతో ముంచెతు తుంది. కాలనీలో డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో

కాలువలో నీరు గృహాలను చుట్టుముట్టి రోడ్లపై తిష్టవేస్తుం దని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రహదారులపై ఎట్టు చూసిన నీరు నిలిచి ఉన్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. నీటిలో పాములు, విషపురుగులు తిరుగుతున్నాయని చిన్నారులు బడికి వెళ్ళాలంటే భయపడుతున్నారంటూన్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు కోతకు గురి కాబడిన ప్రాంతంలో మట్టిని నింపి కట్టపై ముళ్ళ కంపను అడ్డుగా వేసి చేతులు దులుపుకున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాలనీలో నీరు పోయేందుకు డ్రైనేజి వ్యవ స్థను ఏర్పాటు చేయించాలని అధికారులకు ప్రజాప్రతి నిధులకు మొరపెట్టుకుంటున్నప్పటికి ఫలితం లేదని కాలని వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి విఠలేశ్వరనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఆ విషయమై ఇరిగేషన్ ఎఈ కె. రవిబాబును వివరణ కోరగా నేషనల్ హైవే రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా కాలువలో నీరు దిగువకు సరఫరా కావడంలో కొంత ఇబ్బందులు తలెత్తాయని దీని కారణంగానే కాలువ కట్ట కోతకు గురికాబడి కాలనీలోకి నీరు ప్రవేశించిందని తర్వలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన చెప్పారు.

ఆటోడ్రైవర్లకు భారంగా మారిన జీవో రద్దు చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల : ఆటో డ్రైవర్లకు భారంగా మారిన జీవో నెం 21ను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ తెలిపారు. బాపట్ల పట్టణంలోని చీలురోడ్డు సెంటర్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ఆటో డ్రైవర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామేల్ మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగులు ఆటో, వ్యాన్‌లు ప్రవేటు ఫైనాన్సర్ల నుండి అప్పులు తీసుకుని నడుపుకుంటున్నారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశ పెట్టి జీవో నెం 21తో ఆటో డ్రైవర్ల పరిస్థితి రోడ్డున పడే విధంగా తాయారైందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులపై పన్నులు వేసి సామాన్యులను ముప్పుతిప్పలు పెడుతున్నాయని విమర్శించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జేబీ శ్రీధర్ మాట్లాడుతూ గ్రీన్ ట్యాక్స్. రోడ్ ట్యాక్స్ టోల్ ఫాజా ఫీజులు రద్దు చేసి సీఎన్‌జీ గ్యాస్ ధరలను నియంత్రించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆటో, మోటారు వాహనాలపై ఫెండింగ్‌లో ఉన్న పోలీస్ శాఖ ఈ - చలానాలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లను బాగు చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరించటం సరికాదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం పీఎఫ్, ఈఎస్ఐ ఫించన్‌తో కూడిన ఆటో రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. డీజిల్ పెట్రోల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. అనంతరం ఆర్డీవో జి.రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా, ఆటో డ్రైవర్ నాయకులు షేక్ షబ్బీర్ ఆలీ, షేక్ రఫీ, రాంబాబు, సుబ్బారావు, సీరాజ్, ఖాధర్‌వలి, అంజి, రాజారత్నం, వెంకటేశ్వర్లరెడ్డి తదితరులున్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-వినుకొండ: కార్తీక మాసం సందర్భంగా సాయి ప్రకాష్ ఆధ్వర్యంలో మూడో గురువారం స్థానిక ఏనుగుపాలెం రోడ్‌లో గల ప్రకాష్ లాడ్జింగ్ వద్ద భారీగా పేదలకు ఉచిత అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి ప్రకాష్ షాప్ నిర్వాహకులు పెంచల బాబు మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న అంటూ కార్తీక మాసం సందర్భంగా ప్రతి గురువారం పేదలకు అన్నదానాన్ని చేయటం ఎంతో సంతో షంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అలా పుల్లారావు, కూచి. రామాంజనేయులు, కళాసాగరి ట్రస్ట్, మన్యం వెంకటేశ్వర్లు, దుర్గ, సాంబ, సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంపీ డీవో ఎస్.నాగలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని ఆముదాలపల్లి ఎంపీయుపీ పాఠశాలను ఆమె సందర్శించి మధ్యాహ్న భోజనం పనితీరును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. భోజనం తయారీలో రుచి, శుచి, శుభ్రత పాటించాలని చెప్పారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు ప్రతి రోజు మంచి భోజనం, పాలు, గుడ్లు తదితర బలవర్ధకమైన పోషకాహారాన్ని అందించా లన్నారు. మండలంలోని దిండి, కొత్తపాలెం గ్రామ సచివాలయాలను తహశీల్దార్ ఎం.శిరీష ఆకస్మికంగా సందర్శించి సిబ్బంది హాజరు పట్టి, రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. మండలంలోని ముత్తుపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయం భవనంను హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణతో కలిసి మండల ప్రత్యేక అధికారి పి.సురేష్ పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు.

మహారాజశ్రీ గురజాల ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్. 126/2020

బిట్విన్ :
ఎస్‌కె. రెహమాన్ తండ్రి సైదా సాహెబ్ ఆర్/ఓ. డోర్ నెం : 7-120 గురజాల గ్రా॥ మం. పల్నాడు జిల్లా. - వాది

మరియు

ఎస్‌కె. మాబు హుస్సేన్ తండ్రి మహ్మద్ హుస్సేన్ ఆర్/ఓ. గురజాల గ్రా॥ మం. పల్నాడు జిల్లా. - ప్రతివాది

పై నెంబరు దావాను వాది ప్రతివాదిపై ప్రామిసరి నోటు బాకీ రాబడి నిమిత్తం. దావా దాఖలు చేసి యున్నారు. సదరు దావాలో ప్రతివాది సమన్లు జారీ నిమిత్తం కోర్టు వారు **18-11-2022న** వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు **ఉదయం 10.30ని॥కి** కోర్టులో హాజరు అయి స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా కానీ హాజరు అయి, ఆక్షేపణలు తెలుపుకొనవలసి యున్నది. లేని యెడల పరోక్షమందు తీర్మానించబడును.

కాపూరి రామకృష్ణ, అడ్వకేట్
గురజాల (గ్రా)
సెల్ : 9849144606

ఆఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు: ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : మహిళలపై ఆఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. జిల్లా లోని మార్టూరు మండలం ద్రోణాదులలో 2018 సంవత్సరంలో ఒంటరి మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందు తుడు బెల్లంకొండ అంకమ్మకు ఒంగోలు 2వ అదనపు న్యాయమూర్తి 5 ఏళ్ల జైలు శిక్ష, జరిమాన విధించటంపై జిల్లా ఎస్పీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఒంటరి మహిళల, బాలికల భద్రత కోసం పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. ఎక్కడైన మహిళలు ఆకతాయిల వల్ల సమస్యలు ఎదుర్కొంటుంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆకతాయిలు తీరు మార్చుకోకుండా పదే పదే నేరాలకు ప్పాలడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఫోక్సో, మహిళల సంబంధిత కేసుల్లో నిర్భయంగా సాక్షులు సాక్ష్యం చెప్పేలా పోలీసులు తర్ఫీదు ఇవ్వాలన్నారు. నిందుతులు తప్పించుకోకుండా శిక్షపడేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. మార్టూరు సీఐ ఆంజనేయరెడ్డి, ఎస్సై రవీంద్రారెడ్డి, ఏఎస్సై లక్ష్మినారాయణ, కోర్టు కానిస్టేబుల్ కిరణ్‌లు ముద్దాయికి శిక్షపడటంతో చూపిన ప్రతిభకు గానూ ఎస్పీ అభినందించారు.

అర్హులందరికీ పథకాలు ఇస్తున్నాం..

విశాలాంధ్ర-దుర్గి : పార్టీలు, మతాలకతీతంగా అర్హులందరికీ పథకాలు ఇస్తున్నామని ప్రభుత్వ విప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా అభివృద్ధి మండలి ఛైర్మన్, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముటుకూరు గ్రామములో గురువారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లి గ్రామంలోని ప్రతి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏ కుటుంబానికి ఏఏ పథకాలు ద్వారా పొందిన లబ్దిని ఆ ఇంటికి సంబంధించిన సంక్షేమ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చూసి చదివి వినిపించారు. తొలుత ఎంపీపీ ఏచూరి సునీతాసాయిశంకర్, సర్పంచ్ తోటకూర వెంకటనరసమ్మనాగేశ్వరావు, ఎంపీటీసీ పసుపులేటి వెంకట్రామయ్య, ఉప సర్పంచ్. గొంది నాసరయ్యల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పిన్నెల్లికీ గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమములో మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం పెద్దబాయి, ఎమ్మెల్యే సలహాదారు అజీజ్, కేశంశెట్టి అంజయ్య, జాస్తి రామూర్తి, కొల్లి హనుమయ్య, కట్టెబోయిన రవి, పేర్ల వెంకటేశ్వర్లు, పులిమెల ప్రసాద్, మారుతి, లింగా గురవయ్య, కటకం చిన వెంకటయ్య, రామిశెట్టి బాబురావు, ఎం.ఆదిరెడ్డి, ఆదినారాయణ, ఎం.శివరామకృష్ణ, ఎంపీడీవో జీఎల్ గుప్తా, ఏవో వై.అమీర్ రెడ్డి, ఏపీఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర-వెల్దుర్తి: గిరిజనులను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం కేపీ గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన 25 కె.వి ట్రాన్స్ఫార్మర్ల పంపిణీలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మూడు కోట్ల రూపాయల వ్యయం చేసే 145 విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను రైతులకు మంజూరు చేసిందని, వాటిని రైతులకు అందించడం తను ఎంతో సంతోషాన్ని కలగజేస్తుంది అన్నారు. అంతేకాకుండా 65 లక్షల రూపాయల వ్యయంతో 5 ఎంవి పిటిఆర్ ను కరెంటు లో ఓల్టేజీలు రాకుండా ప్రారంభించామని, దీని వల్ల రైతులకు ఎంతో ఉపయోగం జరుగుతుంది అన్నారు. మండలంలో జలకళ ద్వారా 1000 బోర్లు మంజూరు అయితే ఇప్పటికి 450 బోరుబావులను రైతుల భూములలో వేయడం జరిగిందని, మిగిలిన బోరు బావులను వేసవికాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీపీ చింత శివరామయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, జడ్పీటీసీలు మల్లు స్వామి, రూప్లి బాలు నాయక్, వైస్ ఎంపీపీ సంజీవరెడ్డి, సర్పంచులు పాండు నాయక్, వెంకట్ రెడ్డి, డి ఈ హరిబాబు, ఏడిఈ రాములు, మాజీ జెడ్పిటిసి బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అధికార పార్టీ అన్యాయాలను ప్రజలకు తెలియజేస్తాం

విశాలాంధ్ర-గుంటూరు : టిడ్కో గృహాలు, జగనన్న గృహాల పేరుతో అధికార పార్టీ చేస్తున్న అన్యాయాలను ప్రజలకు తెలియజేయడమే 'జగనన్న ఇల్లు పేద ప్రజల కన్నీళ్లు' కార్యక్రమ ముఖ్యఉద్దేశ్యమని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటంలో ఒక్క ఇల్లు కూల్చలేదని వైసీపీ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, కానీ మేము 50 ఇళ్ళు కూల్చారని చెబుతున్నామని, దీనిపై ఇప్పటం నడిఒడ్డులో చర్చకు రావాలని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. పవన్ కళ్యాణ్ ఇప్పటం విచ్చేసినప్పుడు అక్కడ జాతీయ నాయకుల విగ్రహాలు తొలగించారని, కానీ జగన్ రెడ్డి తండ్రి విగ్రహాలు తొలగించలేదని ప్రశ్నిస్తే అది కూడా శుద్ధ అబద్ధమని చెబుతున్నారని అన్నారు. దీనిపై కూడా చర్చకు సిద్ధమని ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమాల్ మాట్లాడుతూ పార్టీ నాయకులు జగనన్న గృహాలను సందర్శించి పూర్తి అవగాహనతో అధికార పార్టీ ఎన్ని వేల కోట్లు దోచుకుందో ప్రజలకు వివరిస్తామని అన్నారు. జగన్ రెడ్డి 28 లక్షల ఇల్లు నిర్మించి ఇస్తామని అన్నారని, కానీ ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా ప్రజలకు ఇచ్చిన దాఖలా లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లిక, నారదాసు రామచంద్రప్రసాద్, కూరపాటి నాగేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, తుమ్మల నరసింహారావు, తన్నీరు గంగరాజు, సుంకే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ సేవా సమితి సమావేశాలు ప్రారంభం

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : మద్యేంద్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మూడవ భక్త సమ్మేళన సంస్థాగగత సమావేశాలు ఈ నెల 11, 12, 13 తేదీలలో రామకృష్ణ సేవా సమితి ప్రాంగణములో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు సిహెచ్ చిరంజీవి తెలిపారు. గురువారం స్థానిక సమితి కార్యాలయంలో ఏర్పాటుచేసిన బ్రోచరావిష్కరణ కార్యక్రమంలో పలువురు సమితి సభ్యులు కార్యనిర్వాకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపట్ల, కర్లపాలెం, చీరాల సమితీలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో భక్తులకు, స్త్రీలకు, యువతకు రామకృష్ణ మిషన్ స్వామీజీలు, శారదన్ మిషన్ మాతాజీలు, పలువురు వక్తలు పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారని తెలిపారు. దేశ వ్యాప్తంగా 15 రాష్ట్రాల నుండి 5000 మంది వరకు మూడు రోజుల కార్యక్రమంలో పాల్గొనడం వలన ఏర్పాట్ల విషయంలో అన్ని సిద్ధం చేసినట్లు చిరంజీవి తెలిపారు. 11వ తేదీ 10 గంటలకు స్థానిక రోటరీ కళ్యాణ మండపంలో యువతతో ప్రారంభించి 13వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట వరకు భక్త సమ్మేళనం కార్యక్రమం వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని బాపట్ల రామకృష్ణ సేవా సమితి నిర్వాహకులు నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల ఇష్టారాజ్యం

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు
అనుమతులు అంతంత మాత్రమే
కార్పొరేట్ వైద్యం పేరుతో వేలల్లో ఫీజులు
కొరడా ఝుళిపించేందుకు సిద్ధమైన వైద్య ఆరోగ్య శాఖ

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : జిల్లాలోని పలు ప్రయివేటు ఆసుపత్రులు వేలకు వేల రూపాయలు ప్యాకేజీ రూపంలో రోగుల వద్ద డబ్బులు దండు కుంటూ జలగల్ల పీడిస్తున్నారు. ఇలాంటి ఆసుపత్రులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిరంతర తనిఖీలు లేకపోవటంతో తమకు ఇష్టం వచ్చిన రీతిలో రోగుల నుండి ముక్కుపిండి ఫీజులు వసూళ్ల చేస్తున్నారు. ఒకవేళ ఎవరైన అధికారి తనిఖీలకు వస్తే తమకున్న పలుకుబడితో మేనేజ్ చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం 8 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. కానీ కొత్తగా ఏర్పడ్డ బాపట్ల జిల్లాలో తనిఖీ బృందం ఎక్కడ కనిపించటం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న కొంతమంది వ్యక్తులు విచ్చల విడిగా ప్రవేటు ఆసుపత్రులు పెడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. జిల్లా కేంద్రంలో పాటు అన్నీ మండలాల్లో దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది. చాలా ప్రయివేటు అసుపత్రులు సరైన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారు. ఈ ప్రవేటు ఆసుపత్రుల్లో సరైన అర్హత లేకున్నా కొంతమంది ల్యాబ్ టెక్నీషియన్‌గా, ఫార్మాసిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ఆసుపత్రుల తీరిది

జిల్లాలో 200 ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు ఉన్నాయి. పలు ఆసుపత్రులు నిబంధనలు గాలికి వదిలేశాయి. బయో మెడికల్ వ్యర్థాలు, కాలుష్య నియంత్రణ బోర్డు ధృవీకరణ పత్రాలు కూడా లేని పరిస్థితి. బయోమెడికల్ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలిసి పడివేస్తున్నారు. కొన్నిచోట్ల ఇరుకు గదుల్లో తాత్కాలిక అనుమతులతో రోగులకు ఎలాంటి గాలి వెలుతురు లేని ప్రదేశాల్లో ఆసుపత్రులు నడుస్తున్నాయి. చాలా ఆసుపత్రుల్లో రోగులకు కనీస వసతులు కూడా లేవు. ఇరుకైన భవనాల్లో ఆసుపత్రులు నిర్వహిస్తూ అగ్నిమాపక నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు.

ఆసుపత్రి ఏర్పాటుకు నిబంధనలు ఇవీ..

ఆసుపత్రికి నిర్వహణకు అగ్నిమాపక శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ తప్పకుండా ఉండాలి. గ్రామల్లో అయితే పంచాయితీ నుంచి పట్టణాల్లో అయితే మున్సిపాలిటి నుంచి అమోదం లభించాలి. ఆసుపత్రి ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి క్లియరన్స్ ఉండాలి. పోలీసు శాఖ నుంచి అనుమతి కూడా ఉండాలి. ఎంబీబీఎస్ పట్టా పొందిన డాక్టర్ పేరుతో ఆసుపత్రి రిజిస్ట్రేషన్ జరగాలి. ఆసుపత్రి జనావాసాలకు దూరంగా ఉండాలి. ఆసుపత్రి చుట్టూ కాళీ స్థలం ఉండాలి. విశాలమైన భవనాల్లో ఏర్పాటు చేయాలి. దారి వెళుతురూ దారాళంగా వచ్చే విధంగా గదులు ఏర్పాటు చేసుకోవాలి. వైద్య రంగంతో సంబంధంతో లేని వ్యక్తులు నిర్వాహకులుగా ఉండ కూడదు. నిపుణులైన వైద్యులతో పాటు అన్నీ రకాల పరీక్షలకు సంబంధించి వైద్య పరికరాలు ఉండాలి.

తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం..
విజయమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా నడుస్తున్న ప్రయివేటు ఆసుపత్రులపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఆసుపత్రులు ఏర్పాటు చేయాలి. గడువు తీరిన, నిబంధనలకు విరుద్దంగా నడుస్తున్న ఆసుపత్రులపై తనిఖీలు చేపడతాం.

బాదుడే బాదుడు కార్యక్రమంలో నారా లోకేష్

విశాలాంధ్ర-తాడేపల్లి: మంగళగిరి నియోజకవర్గం లోని తాడేపల్లి పట్టణంలో ప్రకాష్ నగర్‌లో నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శ నారా లోకేష్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలును అడిగి తెలుసు కున్నారు. ఇటీవల మరణించిన టీడీపీ కార్యకర్తల ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్పొరేషన్ వాటర్ అర్ధరాత్రి పూట ఇస్తున్నారని.. ఆ సమయంలో నీళ్లు పట్టుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తూ లోకేష్‌కి చెప్పుకున్నారు. గెలిచిన వెంటనే కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చి మోసం చేసారని తమ ప్రజలు తమ బాధను వ్యక్తంచేశారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు సమస్యల గురించి ఎన్ని సార్లు వేడుకున్నా అధికారులు స్పందించడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి నీళ్లు ఇవ్వడం వలన మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పైగా కలుషితమైన నీరు వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని నారా లోకేష్ హామీ ఇచ్చారు. గెలిచిన వెంటనే కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఇళ్ళ పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి ఆర్కే ప్రజల్ని మోసం చేశారని మేము గెలిచిన ఏడాదిలోనే ఇళ్ళ పట్టాలు అందిస్తాని, త్రాగునీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్య పరిష్కరిస్తామని అన్నారు. చెత్త పన్ను పేరుతో ప్రజల్ని వేధించడం దుర్మార్గమన్నారు. చెత్త పన్ను కట్టకపోతే సంక్షేమ కార్యక్రమాలు ఆపేస్తాం, నీటి కనెక్షన్ కట్ చేస్తామని బ్లాక్ మెయిల్ చేయడం అన్యాయమని అన్నారు. చెత్త పన్ను వేసిన చెత్త బ్యాచ్ ఇది. పన్నుల భారంతో సామాన్యులు బ్రతకలేని పరిస్థితి తెచ్చారని కుడి చేత్తో పది రూపాయిలు ఇచ్చి ఎడమ చేత్తో వంద రూపాయిలు కొట్టేస్తుంది వైసీపీ ప్రభుత్వమని అన్నారు. అధికారంలోకి వస్తే మద్యపాన నిషేధం అన్న జగన్ రెడ్డి ఇప్పుడు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, జే బ్రాండ్స్‌తో మహిళల మెడలో పుస్తెలు తెంపుతున్నారన్నారు. జగన్ రెడ్డి మంగళగిరి నియోజకవర్గంలో సమస్యలు గాలికోదిలి ఎమ్మెల్యే ఇళ్లు కూల్చే పనిలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, ఆరుద్ర భూలక్ష్మి, వల్లభనేని వెంకటరావు, జంగాల వెంకటేష్, దానబోయిన సుందర్రావు యాదవ్, అన్నెం కుసుమ, చిన్నపోతుల చిన్న, గోవాడ దుర్గారావు, ఓలేటి రాము, ఇట్టా భాస్కర్, కంభం సాయి చంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటా: కోన

విశాలాంధ్ర - కర్లపాలెం : పాతకేళ్లగా కోన కుటుంబం ప్రజా సేవలో తరించిందని, ప్రజల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచిపోవటమే తన అభిలాష అని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని యాజలి గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన గత మూడేళ్లగా వైసీపీ పాలనలో ప్రతి కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాల ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ ప్రజలు తమ కుటుంబాన్ని ఇప్పటి వరకు ఎంతగానో ఆదరించారన్నారు. తన తండ్రి కోన ప్రభాకరరావును మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపించుకుని తనను రెండుసార్లు గెలిపించుకుని మీకు సేవ చేసే అవకాశం ఇచ్చారన్నారు. నియోజకవర్గ చరిత్రలో తండ్రి తరువాత ఎమ్మెల్యేగా పని చేసిన ఘనతను ప్రజలు తమకే అందించటం చాలా సంతోషకరం అన్నారు. ప్రజల కష్ట సుఖాలు తెలుసుకునేందుకే సీఎం జగన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, సర్పంచ్ నాదేండ్ల భానుప్రసాద్, మాజీ సర్పంచ్ గుంద్రెడ్డి శివ, ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పేరాల వెంకటసురేష్, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, నాయకులు మందపాటి పరమానందకుమార్, మార్పు బెనర్జీ తదితరులున్నారు.

ప్రైవేటు కేసులు వేస్తాం...

విశాలాంధ్ర-మాచవరం: మండలంలోని తురకపాలెం గ్రామంలో రోడ్డు విస్తరణలో భాగంగా జరిగిన గొడవలో సర్పంచ్ పై దాడి జరగకపోయినా జరిగిందంటూ గ్రామంలో తెలుగుదేశం పార్టీ వారిపై అక్రమంగా 18 మందిపై కేసులు పెట్టడం జరిగిందని సర్పంచుకు ఏమి దెబ్బలు లేకపోయినా 307, 306 కేసులు పెట్టి ఎనిమిది మందిని అరెస్టు చేసి వారిని తీవ్రంగా కొట్టడం జరిగిందని. అదేవిధంగా ఈ కేసులో 9వ తరగతి చదువుతున్న మైనర్ బాలుడిని నిందితున్నిగా చేర్చి రిమాండ్‌కు పంపడం జరిగిందని గురజాల మాజీ శాసనసభ్యులు యురపతినేని శ్రీనివాసరావు ఆరోపించారు. ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాటలు విని మాచవరం పోలీసులు పెట్టిన అక్రమ కేసు గురువారం హైకోర్టులో స్టే విధించడం శుభ పరిణామం అని అన్నారు. అక్రమంగా కేసులు బనాయించి చట్టాన్ని చేతిలోకి తీసుకొని వ్యవహరిస్తే ఇలాంటి పరిణామాలే వస్తాయన్న సంగతి ఇప్పటికైనా మాచవరం ఎస్ఐ లాంటి వాళ్లు తెలుసుకోవాలన్నారు. అన్యాయంగా మాచవరం పోలీస్ స్టేషన్ తీసుకొచ్చి కొట్టిన దానిమీద ప్రైవేట్ కేసులు వేస్తామని, అవసరమైతే మానవ హక్కుల కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. అధికార పార్టీ నాయకుడు చెప్పినట్లుగా ప్రవర్తిస్తే తప్పకుండా చట్టపరంగా పోరాడుదాం ఇలాంటి చట్ట వ్యతిరేకమైన పనులు చేసే అధికారులను వదిలి వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను రక్షించుకుంటామని భవిష్యత్తులో గురజాల నియోజవర్గంలో ఎటువంటి పడాల్సిన పనిలేదని కార్యకర్తలందరూ మనోధైర్యం ఉండాలని వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వం అని అన్నారు. అహంకారంతో ఇంకా కొట్టాలి కొట్టకుండా ఊరుకుంటారా అని మాట్లాడిన ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి బుద్ధి చెప్పే విధంగా హైకోర్టు తీర్పు ఉందని ఆయన తెలిపారు.

జగనన్న కాలనీలకు వర్ష గండం

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్నటువంటి జగనన్న కాలనీలా అభివృద్ధి కార్యక్రమాలకు అడుగడుగునా వర్షం ఆటంకంగా మారడం విచిత్రంగా ఉంది. నిరుపేదల కోసం ప్రభుత్వం కేటాయించినటువంటి జగనన్న కాలనీలలో సామాన్యులు గృహాలను నిర్మించుకొని వాటిలో ఆవాసాలను ఏర్పాటు చేసుకునే సమయంలో వర్షం ఆటంకం పరచడం పరిపాటిగా మారింది. బుధవారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ జగనన్న కాలనీలను పరిశీలించి డిసెంబర్ నాటికల్లా పూర్తిచేయాలని ఆదేశాలు ఇవ్వడంతో మున్సిపల్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇదే సమయంలో బంగాళాఖాతంలో వాయుగుండం పడడం జగనన్న కాలనీలో పనికి ఆటంకం కలగడం కింది స్థాయి అధికారులు తలలు పట్టుకునే దుస్థితి నెలకొన్నది. గురువారం కాలనీలలో జేసీబీలతో రోడ్లను మరమ్మతు చేసి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చేయాలని తలంచారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు సంపూర్ణమైనట్లయితే డిసెంబర్ నాటికి జగనన్న కాలనీలు ప్రారంభానికి నోచుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల : ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగియుండాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి అన్నారు. స్థానిక రొంపిచర్ల మండలం అన్నవరం గ్రామంలో గురువారం మండల న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం జరిగింది. ఈ సదస్సుకు న్యాయవాది కె.రాధిక అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి మాట్లాడుతూ ఆస్తి పంపకాలలో పురుషులతో పాటు స్త్రీలకు సమాన హక్కు ఉందని అన్నారు. గృహ హింస చట్టం ద్వారా స్త్రీలు ఇబ్బందులు పడకుండా రక్షణ పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పట్ల వారి పిల్లలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, భార్య భర్త నుంచి నిర్లక్ష్యమునకు గురైనప్పుడు వారి ఆదాయాలను బట్టి విచారించి భరణం పొందవచ్చునని అన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ రూల్స్ పాటించి వాహనములు నడపాలని అన్నారు. వాహనములు కొనుగోలు చేసేటప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా పేద ప్రజలకు సత్వరమే న్యాయం జరిగేందుకు కృషి చేయడమే కాకుండా ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు గోదా రమేష్ కుమార్, నూతక్కి బంగారుబాబు, కాంచన, గోదా వజ్రబాబు, గోదా సందీప్ కుమార్, చింతగుంట జోసఫ్, గ్రామ సర్పంచ్ నందం వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ తల్లపనేని భుజంగరావు, ఎంపీటీసీ సభ్యులు రాపూరి కుమారి తదితరులు పాల్గొన్నారు.

మల్లాదిలో న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని మల్లాది గ్రామంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. దీనికి సత్తెనపల్లి సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్, గ్రామ పెద్ద వెంప జ్వాలా నరసింహారావు, న్యాయవాదులు శ్రీనివాసరావు, గంటా రవి, లీగల్ వలంటీర్ కుమార్, సుభాని తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు న్యాయపరమైన విషయాలు వివరించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పంచదార, కందిపప్పు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు: తెల్లరేషన్ కార్డుదారులకు పంచదార, కందిపప్పు లాంటి నిత్యావసర సరుకుల పంపిణీ నిలిపివేయడం దారుణమని టీడీపీ జిల్లా కార్యదర్శి, పెదకూరపాడు మండల అధ్యక్షులు అర్తిమళ్ల రమేష్ అన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ప్రభుత్వ చౌకదుకాణాలలో ప్రస్తుతం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారని, పేద, మధ్యతరగతి ప్రజలకు నిత్యావసరాలైన పంచదార, కందిపప్పు పంపిణీ నిలిపివేశారని, పేదల సంక్షేమం కోసం అదనంగా ఏమీ ఇవ్వలేకపోయినా ఉన్న వాటిపై కోతలు విధించడంపట్ల ఆయన నిరసన వ్యక్తం చేశారు. పంచదార, కందిపప్పులతోపాటు గతంలో ఇచ్చిన మాదిరిగా చౌకడిపోల ద్వారా అన్ని రకాల నిత్యావసర సరుకులు అందించేలా పౌరసరఫరాల శాఖ తగుచర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజాగ్రహాన్ని, ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆశీర్వాదం అచ్చంపేట మండల పరిధిలోని చింతపల్లి గ్రామంలో గురువారం గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిగామ ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా ఓటర్ నమోదు సక్రమంగా ఉన్నాయా లేవా అని అధికారులను అడిగి వివరాలు తెలుసుకోవాలన్నారు. మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ సూచన మేరకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురునాథం రమేషు, స్వామి, సతీషు, గోపయ్య, సూరయ్యలతో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-దుర్గి : స్థానిక శాఖా గ్రంథాలయములో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారని ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారిణి మాచర్ల మెర్సి తెలిపారు. గురువారం ఆమె వారోత్సవాలకు సంబంధించిన కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 14న వారోత్సవాల ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన ఏర్పాటు, మాదకద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య ప్రముఖులను స్మరించుట, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్య, క్విజ్, క్రీడల పోటీలు, 19న దిశ చట్టం, మహిళా సాధికారతపై చర్చ, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయపఠనం, వారోత్సవాలు ముగింపు, బహుమతులు ప్రధానోత్సవం జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆమె కోరారు.

14న అగస్తేశ్వర స్వామి ప్రతిష్టామహోత్సవం

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి కాజ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అగస్తేశ్వర స్వామి (శివాలయం) 7వ వార్షికోత్సవ ప్రతిష్టా మహోత్సవం 14వ తేదీ జరుగుతుందని భక్త బృందం ప్రతినిధి అప్పికట్ల శ్రీహరి నాయుడు తెలిపారు. నగరంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్‌లో గురువారం వార్షికోత్సవ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పికట్ల శ్రీహరి నాయుడు మాట్లాడుతూ రెండువేల సంవత్సరాల చరిత్ర కలిగిన అతి ప్రాచీనమైన శివాలయంలో 14వ తేదీ ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, నవగ్రహ రుద్ర పాశుపత హెూమం, 1008 పార్థివ శివలింగ ములకు బిల్వార్చన, అభిషేకం భక్తులే స్వయంగా నిర్వహించుకోవచ్చునని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు అప్పికట్ల కృష్ణమనాయుడు వెల్ఫే ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, రాత్రి 7 గంటలకు శివపార్వతుల శాంతి కళ్యాణ మహెూత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని శ్రీహరి నాయుడు కోరారు. ఈ సమావేశంలో భక్త బృందం ప్రతినిధి ఇంటూరి రాంబాబు పాల్గొన్నారు.

ఇళ్లను బలవంతంగా కూల్చేశారు

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లి మండలం ఇప్పటంలో తమ ఇళ్ళు బలవంతంగా పడవేశారంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తూ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితులు అన్నపూర్ణ ఏమినేని మాట్లాడుతూ ఇంటిలో లేనప్పుడు స్లాబ్ పడవేశారని కత్తితో పొడుచుకుంటానని చెప్పినప్పుడు అపుడు ప్రహరీ మెట్లు పడవేశారని అన్నారు. స్వప్న ఏమినేని మాట్లాడుతూ దారుణంగా జెసిబితో వచ్చి హడావిడి చేశారని అన్నారు. వైసిసి నాయకులు కాళ్ళు పట్టుకుని వేడుకున్నా కనికరించలేదని వాపోయారు. పైగా బెదిరింపులకు దిగుతున్నారని అన్నారు. ఇల్లు కూల్చి వేతలు లేవని నిరూపిస్తే రూ.4 లక్షల ఇస్తామన్న వైసిపి నాయకులు బయటకు రావాలని అన్నారు. పవన్ కళ్యాణ్ ప్రకటించిన రూ.50 లక్షలు గ్రామ అభివృద్ధికి ఇస్తాం కాని వైసీపీ నాయకులకు కాదని జనసేన పార్టీ నాయకులు అన్నారు. ఇప్పటం గ్రామంపై వైసీపీ విష ప్రచారం మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు తిరుమల శెట్టి నరసింహారావు, రైతు చంద్రశేఖర్, జగదీష్, కొండలరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

విశాలాంధ్ర-తాడేపల్లి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక గ్రామంలో నాడు-నేడు పనులకు ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతురావులు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం స్కూల్ విద్యార్థిచే శిలాఫలకాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పెనుమాక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు నాడు-నేడు ద్వారా 19 అదనపు తరగతి గదులు, 10 కాంపోనెంట్స్ మొత్తం కలిపి 3 కోట్ల 41 లక్షల 11 వేల రూపాయలు మంజూరు చేసినందుకు సీఎం జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థులందరూ బాగా చదువుకోవాలని తద్వారా దేశం, సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు.

తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-అమరావతి: 14వ మైలు నుంచి కర్లపూడి వరకు తారు రోడ్డు నిర్మాణ పనులను పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యాక్రమంలో ప్రజా ప్రతినిదులు, ఉన్నతాదికారులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర-శావల్యా పురం : స్వయం సహాయక సంఘాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని స్త్రీనిధి మేనేజర్ రంతు చిన్నబుల్లెయ్య అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు నారాయణమ్మ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. చిన్నబుల్లెయ్య మాట్లాడుతూ సంఘ సభ్యులు తీసుకునే రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. స్త్రీనిధి నూతన పథకం ద్వారా రూ.4 లక్షలు, ఉపాధి నిమిత్తం రూ.లక్ష, గేదెలకు రూ.75 వేల వరకు రుణాలు పెంచామని, డ్వాక్రా సంఘాలకు గ్రేడుల వారీగా రుణాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. స్త్రీనిధి సురక్ష లోన్ ప్రొటక్షన్ పథకం ద్వారా రుణాలు తీసుకొన్న సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే రుణాన్ని రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు 6 శాతం వడ్డీకి, దివ్యాంగులకు 7 శాతం వడ్డీకే రుణాలు అందిస్తున్నామని తెలిపారు. స్త్రీనిధి రుణాలను అదనపు చార్జీలు లేకుండా బయోమెట్రిక్ విధానం ద్వారా పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. అమూల్ మెంటార్ గణేష్ కుమార్, వినుకొండ క్లస్టర్ ఎల్సీ కృష్ణ, సీసీలు ఖాజా, బేబీరాణి, ఎకౌంటెంట్ వెంకాయమ్మ పాల్గొన్నారు.